సాక్షి గుంటూరు

శనివారం । 30 । మార్చి । 2024




గోశాల సందర్శన

మంగళగిరి: పెదవడ్లపూడి సాయిబాబా మందిరం వద్ద ఉన్న గోశాలను అయోధ్య రామమందిర్ సంచాలకులు స్వామి వాసుదేవానంద్ సరస్వతి శుక్రవారం సందర్శించారు.



కీర్తనలు ఆలాపన

తెనాలిటౌన్: స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలోని సత్యనారాయణస్వామి ఆలయంలో మహిళలు శుక్రవారం భజనలు చేసి కీర్తనలు ఆలపించారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహరి (ఆది)
గుంటూరు	6.25	4.47
నరసరావుపేట	6.27	4.50
బాపట్ల	6.25	4.49

న్యూస్‌రీల్

ఆత్మీయ సమావేశం పోస్టర్ విడుదల



గురజాల: హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న నియోజకవర్గ పరిధిలోని వారితో ఆత్మీయ సమావేశం ఏప్రిల్14వ తేదీ నిర్వహించనున్నట్లు లోక్‌సభ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పి.అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు.

ఈవీఎం గోదాము పరిశీలన



నరసరావుపేట: ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డు గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం తనిఖీ చేశారు. భద్రత పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులలో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేసి తగు సూచనలు సలహాలు అందజేశారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ఆర్డీఓ సరోజ, ఈవీఎం మిషన్ల నోడల్ అధికారి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

8న బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం



పెదకాకాని: బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవ వేడుకలు ఏప్రిల్ 8, 9తేదీలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా చెప్పారు. పెదకాకాని బాజీబాబా దర్గాలో 536వ ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈఓ మాట్లాడుతూ రాష్ట్ర వక్ఫ్ బోర్డు వారి ఆదేశాల మేరకు నిర్వహించే బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవ వేడుకల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఇప్పటికే బాజీబాబా దర్గా చుట్టూ రూ.1.97 కోట్లతో ప్రహరీ, దర్గా నుండి ప్రధాన రోడ్డు వరకూ సీసీ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. భక్తుల సహకారంతో దర్గా ప్రాంగణంలో నిద్రలు చేసే వారి కోసం ప్రత్యేకంగా షెడ్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 8వ తేదీ సాయంత్రం 5 గంటలకు చాందిని అలంకరణ, రాత్రి 10 గంటలకు బాబావాకి గంధం గుర్రంపై ఊరేగింపు బయలు దేరుతుందన్నారు. దర్గా వద్ద 8 గంటలకు అన్నదానం జరుగుతుందన్నారు. 9వ తేదీ సాయంత్రం 3 గంటలకు భక్తులకు గంధం పంచుట, సలామి ప్రార్థన జరుగుతుందన్నారు. అనంతరం దర్గా ఉరుసు మహోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ వక్ఫ్ బోర్డు అసిస్టెంట్ సెక్రటరీ సయ్యద్ ఆదంషఫీ, షేక్ సత్తార్, షేక్ రఫీ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఉద్యోగి సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నగర పాలక సంస్థ ఉద్యోగి ఎం.వసీమ్ అలీ(రికార్డు అసిస్టెంట్)ని సస్పెండ్ చేస్తూ తూర్పు నియోజకవర్గ ఆర్వో, నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 'టీడీపీ ఎన్నికల ప్రచారంలో జీఎంసీ ఉద్యోగి' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. తూర్పు ఆర్వో, నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పందిస్తూ శుక్రవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 513.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 810.60 అడుగుల వద్ద ఉంది.



గుంటూరు డాన్‌బాస్కో చర్చిలో శిలువ కార్యక్రమంలో క్రైస్తవ విశ్వాసులు

కరుణామూర్తి.. నిత్య స్ఫూర్తి

ఆయన రుధిరం.. సర్వమానవాళికి రక్షణ కవచం,
ఆయన శిలువ యాగం.. సర్వ లోకానికి మోక్ష మార్గం
ఆయన మరణం.. సర్వ జనులకు శుభ సూచకం
ఆయన త్యాగం.. ఎప్పటికీ, ఎన్నటికీ అజరామరం

సమస్త మానవాళి పాప ప్రక్షాళన కోసం ఏసు క్రీస్తు శిలువలో బలి అర్పణగా మారిన ఘట్టాన్ని స్మరించుకుంటూ క్రైస్తవ లోకం ఆ కరుణామయుడిని మనసారా కొలిచింది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి ఉపవాసం ఉండి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసింది. శిలువ యాత్రలతో ఆయన మరణ సారాన్ని వివరించి చెప్పింది. ఆయన శిలువలో మాట్లాడిన చివరి ఏడు మాటలను ధ్యానించి.. ఆ మాటలే తమకు నిత్య స్ఫూర్తి అని చాటి చెప్పింది. -సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



గుంటూరు పట్టణంలోని పునీత ఆగ్నేసమ్మ చర్చిలో శిలువ యాత్ర

పశ్చిమలోనూ గెలిచి చూపిస్తాం

- బార్ అసోసియేషన్ ఎన్నికలే అందుకు నాంది
- అన్ని పక్షాలు ఏకమైనా మేమే గెలిచాం
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే జరుగుతుంది
- వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు
- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ వ్యూహాత్మక విజయం
- ప్రజా బలం ముందు పొత్తు బలం నిలబడలేదు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరు బార్ అసోసియేషన్ టీమ్‌కు అభినందనలు



వెంకటరెడ్డిని అభినందిస్తున్న మంత్రి విడదల రజిని, పక్కన పోలూరి తదితరులు

పట్నంబజారు: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల్లోనూ గెలిచి వైఎస్సార్ సీపీ సత్తా చూపిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి కాసు వెంకటరెడ్డి ఘన విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం నేతలు, న్యాయవాదులు మంత్రి రజినిని మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రమౌళినగర్‌లోని ఆమె కార్యాలయంలో కలిసిన నేపథ్యంలో కాసు వెంకటరెడ్డిని దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా విడదల రజిని మాట్లాడుతూ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి విజయం సాధించిందని ప్రశంసించారు. కొత్త ప్యానెల్ గొప్పగా పనిచేసి అందరి మనసులు గెలుచుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోపాటు కాంగ్రెస్‌పార్టీ కూడా జతకలసి బార్ ఎన్నికల్లో పోరాడారని, మరో వైపు వైఎస్సార్ సీపీ ఒంటరిగా బరిలో నిలిచిందని, న్యాయవాదులందరి మనసు గెలుచుకుని ఘన విజయం సాధించామని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని కూడా కైవసం చేసుకోబోతున్నామని, అందుకు బార్ అసోసియేషన్ ఎన్నికలే నాందిగా నిలిచాయన్నారు. ఎన్ని పార్టీలు ఏకమై వచ్చినా వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరని, ప్రజా బలం ముందు పొత్తు బలం నిలబడదని స్పష్టం చేశారు.

న్యాయవాదులకు న్యాయం చేసింది జగనన్నే

దేశ చరిత్రలోనే న్యాయవాదులకు నిజమైన న్యాయం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని మంత్రి రజిని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ కింద నెలకు రూ.5 వేలు ఇస్తున్నారని చెప్పారు. న్యాయవాదుల సంక్షేమ నిధి కోసం రూ.100 కోట్లు కేటాయించారని తెలిపారు. కరోనా కాలంలో ఒక్కొక్క న్యాయవాదికి రూ.20 వేల చొప్పున బార్ కౌన్సిల్ ద్వారా అందజేశారని గుర్తు చేశారు. న్యాయవాదుల సంక్షేమం కోసం ఇంతగా గతంలో ఏ ముఖ్యమంత్రి ఆలోచించలేదని, సీఎం వైఎస్ జగన్ చేస్తున్న సంక్షేమాన్ని గుర్తించే హోరాహోరీగా నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన కాసు వెంకటరెడ్డిని న్యాయవాదులు గెలిపించుకున్నారని చెప్పారు. ప్రజలు చేసిన మంచిని ఎప్పటికీ మరిచిపోరని ఈ ఎన్నికలు రుజువు చేశాయని, రేపటి అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రజలు మంచికే పట్టం కడతారని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన మంచే బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలిచేలా చేసిందని తెలిపారు. మంత్రి విడదల రజిని చాకచక్యంగా వ్యవహరించి విజయంలో తనవంతు పాత్ర పోషించారన్నారు. సీఎం జగన్ ప్రభుత్వానికి న్యాయవాదులంతా రుణపడి ఉంటామని, రానున్న ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం గెలుపే లక్ష్యంగా న్యాయవాదులు పనిచేస్తామని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, న్యాయవాదులు సోమసాని ఝాన్సీలక్ష్మి, అజాజుద్దీన్, కేఎస్‌టీ సింగ్, మొండితోక శ్రీనివాసరావు, సుబ్బారావు, వేణు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలకు సర్వసన్నద్ధం

షెడ్యూల్ విడుదల చేసిన ఎస్‌సీఈఆర్‌టీ

యడ్లపాడు: పరీక్ష కాలం. ఇప్పటికే కామన్ బోర్డు పరీక్షలు ముగిశాయి. ప్రాథమిక స్థాయి నుంచి మిగిలిన తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. వార్షిక పరీక్షలకు చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఎస్‌సీఈఆర్‌టీ(స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్) పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఏప్రిల్ 6 నుంచి 19వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, అనుబంధ, ప్రైవేటు పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. 1–8 తరగతులకు సీబీఏ–3(క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్), 9వ తరగతి వారికి వరకూ ఎస్ఏ–2 (సంగ్రహాత్మక మూల్యాంకనం) పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో ఏప్రిల్ 6 నుంచి ఆయా పరీక్షలు రాసేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1–5 తరగతులు చదివే విద్యార్థులకు మాత్రమే డీసీఈబీ ద్వారా ప్రశ్నపత్రాలు అందజేయనుంది. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో 6–9 తరగతులు అభ్యసించే వారందరికీ డీసీఈబీ ప్రశ్నపత్రాలు సరఫరా చేయనుంది. 21న జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఫలితాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంది. 23న ప్రోగ్రెస్ కార్డుల్ని విద్యార్థులకు అందజేయాలి. 24న తరగతి వారీగా ప్రమోషన్ జాబితాలు సిద్ధం చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ ఆదేశాల్లో పేర్కొంది.

అధికారుల పచ్చపాతం

- ఎన్నికల వేళ ఒక్కో పార్టీ అభ్యర్థికి ఒక్కోలా కోడ్ అమలు
- టీడీపీకి ఫుల్ ఫేవర్‌గా..
- వైఎస్సార్ సీపీకి అడ్డంకులు



గురువారం రాత్రి పెదనందిపాడులో వైఎస్సార్ సీపీ నాయకులతో అధికారుల వాగ్వాదం



యనమదలలో టీడీపీ నాయకుల ర్యాలీలో కాల్చుతున్న బాణసంచా(ఫైల్)

ప్రత్తిపాడు: ఎన్నికల కోడ్‌ను నిష్పక్షపాతంగా అమలు చేయాల్సిన అధికారులు, పూర్తిస్థాయిలో పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారు. టీడీపీ కార్యక్రమాలతో పాటు ఆ పార్టీ అభ్యర్థి అయిన రిటైర్డు కలెక్టర్ 'బూర్ల'పై యంత్రాంగం గురుభక్తిని చాటుకుంటుండగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థుల పర్యటనలకు మాత్రం ని'బంధనాలు'ను విధిస్తూ పచ్చపాతాన్ని నిర్భయంగా ప్రదర్శిస్తున్నారు.

- పెదనందిపాడులో నాలుగు రోజుల కిందట తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక పార్టీ నాయకులు బాణసంచా కాల్చుతూ భారీ ఊరేగింపులు చేస్తూ అట్టహాసంగా ర్యాలీ నిర్వహించి, స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి అధికారులు ఎవ్వరూ ఎలాంటి ఆటంకాలు కల్పించకపోగా, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్నా ఎటువంటి అడ్డంకులు చెప్పకుండా పూర్తి స్థాయిలో సహకరించారు.
- ప్రత్తిపాడు మండలం యనమదలలోనూ టీడీపీ ఎన్నికల ప్రచార ర్యాలీలో బాణసంచా కాల్చుతూ, రాజకీయ విందులు నిర్వహిస్తూ.. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. అయినా ఆ సమయంలో మౌనంగా ఉన్న అధికారులు తరువాత అనుమతి తీసుకున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి టీడీపీకి ఫేవర్ చేసి చేతులు దులుపుకున్నారు.

వైఎస్సార్ సీపీకి మాత్రం ని'బంధన'లు..

పెదనందిపాడులో గురువారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందుకు వైఎస్సార్ సీపీ అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు బాణసంచా కాల్చుతూ ఆయనను గ్రామంలోనికి స్వాగతించారు. దీంతో ఆర్వో ఆదేశాలతో ఫ్లయింగ్ స్క్వాడ్, స్థానిక అధికారులు ర్యాలీని అడ్డుకున్నారు. బాణ సంచా కాల్చడానికి అనుమతు ల్లేవని చెప్పి నిలిపివేయించారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులకు అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. నాలుగు రోజుల కిందట టీడీపీ నిర్వహించిన ర్యాలీలో బాణసంచా కాల్చుతుంటే.. అప్పుడు అడ్డుకోని మీరు ఇప్పుడు మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారని అధికారులను ప్రశ్నించారు.

రిటైర్డు కలెక్టర్ కావడంతోనే..

టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు గతంలో ఇక్కడ కలెక్టర్‌గా పనిచేయడం, ఆయన పంచాయతీరాజ్ కమిషనర్‌గా కూడా చేసి ఉండటం, వీరంతా ఏదో ఒక సందర్భంగా ఆయన కింద పని చేసి ఉండటంతో విపరీతమైన గురు భక్తిని చాటుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల అనేక సార్లు బూర్ల రామాంజనేయులు ఓటర్ల జాబితా విషయమై ఆర్వోకు ఫోన్ చేసి అనేకసార్లు మండిపడినట్లుగా ఆ పార్టీ నేతలే బహిరంగంగా చెబుతున్నారని విమర్శిస్తున్నారు.

కరుణ, క్షమాగుణం క్రీస్తు మార్గం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి రజినిని ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

పట్నంబజారు: కరుణ చూపడం, క్షమించడం.. ఈ రెండూ క్రీస్తు చూపిన మార్గాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం నార్త్ ప్యారిస్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆమె పాల్గొన్నారు. మంత్రి రజిని మాట్లాడుతూ మానవాళిని పాపాల నుంచి రక్షించడం కోసం ప్రభువైన క్రీస్తు తన ప్రాణాలను అర్పించిన రోజు గుడ్‌ఫ్రైడే అని పేర్కొన్నారు. మనుషులందరి పాపాల నుంచి విముక్తి కలిగించడం కోసం తనని తాను సంతోషంగా త్యాగం చేసుకున్న రోజు ఇది అని చెప్పారు. అందుకే గుడ్ ఫ్రైడేగా పిలుస్తారని వెల్లడించారు. క్రీస్తు బోధనలు ఎప్పటికీ, ఎవరికైనా ఆచరణీయమేనని వెల్లడించారు. అనంతరం మంత్రి రజినికి పాస్టర్లు ప్రత్యేక ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో బిషప్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

జొన్న దిగుబడులు ఆశాజనకం

- ఎకరాకు 25–30 బస్తాలు
- తెనాలి ప్రాంతంలో కోతలు ఆరంభం
- మార్కెట్ ధరల్లో కొంతమేర తగ్గుదల



తూములూరులో జొన్న కోతలు

తెనాలి: డెల్టాలో రబీలో సాగు చేసిన తెల్లజొన్న కోతకొచ్చింది. అక్కడక్కడా కోతలు ఆరంభించారు. మరో వారంరోజుల్లో ముమ్మరం కానున్నాయి. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు 25–30 క్వింటాళ్లు వస్తోందని రైతులు చెబుతున్నారు. పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్లో ధర తగ్గటం గమనించాల్సిన అంశం. ఎన్నికల కోడ్ సాకుతో వ్యాపారులు ధర తగ్గించారని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వ జోక్యంతో గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తున్నారు.

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని తెనాలి ప్రాంతంలో రెండో పంటగా రబీలో జొన్న, మొక్కజొన్న సాగు తెలిసిందే. తెనాలి నియోజకవర్గంలోని రూరల్ మండలంలో 7,543 ఎకరాలు, కొల్లిపర మండలంలో 8,460 ఎకరాలు చొప్పున మొత్తం 16,003 ఎకరాల్లో జొన్న సాగు చేశారు. మొక్కజొన్నతో పోల్చుకుంటే తెల్లజొన్న సాగు ఖర్చులు తక్కువ. రెండుపర్యాయాలు నీటి తడులిస్తే సరిపోతుంది. అయితే ఈ సీజనులో ఉష్ణోగ్రత హెచ్చుగా ఉండటంతో మూడోపర్యాయం తడులు ఇవ్వాల్సి వచ్చింది. దీనికితోడు రైతులు యూరియా, కాంప్లెక్సు ఎరువులను అధికంగా వినియోగించారు. దీనితో ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి ఖర్చులైనట్లు చెబుతున్నారు.

తెల్లజొన్నకు మార్కెట్‌లో నిన్నటి వరకు బాగున్న ధరలు, పంట చేతికొచ్చే సమయానికి తగ్గటం రైతులను ఆందోళన పరుస్తోంది. నాలుగైదు రోజుల క్రితం వరకు జొన్నకు మార్కెట్లో క్వింటాలు రూ.2,500 ధర పలికింది. కేవలం రోజుల వ్యవధిలోనే క్వింటాలు రూ.2000–2200లకు తగ్గిపోయింది. పంట సాగుకు అయిన ఖర్చులను లెక్కించుకుంటే క్వింటాలుకు రూ.2500 ధర లేనిదే గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు. గతేడాది రూ.2,530 ధరకు కొనుగోళ్లు జరిగాయని గుర్తుచేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు తెరిస్తే బాగు...



పంటల సాగుకే ఖర్చులు పెరుగుతున్నాయి. ఎకరాకు కూలీ ఖర్చులు, నీటితడులకు వ్యయం పెరిగింది. 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. క్వింటాలు రూ.2,500 అమ్ముగలిగితేనే గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు పెడితే మార్కెట్ ధర పెరుగుతుంది.

–రాపూరి పున్నయ్య,
కౌలు రైతు, తూములూరు

ఎన్నికల ఖర్చు ఇంతింతై!

- అభ్యర్థుల ఖర్చు పక్కాగా ఉండాల్సిందే
- అప్రమత్తంగా లేకుంటే చిక్కుల్లో పడ్డట్టే

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. సభలు, ర్యాలీలు, భోజనాలు, వాహనాలు... ఇలా ఎన్నో ఖర్చులు ఉంటాయి. ఎన్నికల రణరంగంలో పైచేయి సాధించడానికి అభ్యర్థులు హద్దులు దాటకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను నిర్దేశించింది. వీటిని పక్కాగా అమలు చేసేందుకు ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించింది.

నామినేషన్ నాటి నుంచి అమల్లోకి...

ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచే వ్యయం అంతా ఆయా రాజకీయ పార్టీల పరిధిలోకి రానుంది. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి ప్రచారంతో పాటు ఇతర ఖర్చులు మొత్తం అభ్యర్థుల ఖర్చులో లెక్కిస్తారు. అభ్యర్థి ఏదైనా జాతీయ బ్యాంకులో ఖాతా తెరిచి లావాదేవీలు నిర్వహించాలి. ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎప్పటికప్పుడు ఖర్చులను నమోదు చేస్తారు.

లెక్క చూపకుంటే వేటే...

సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులు పెట్టిన ఖర్చును లెక్క చూపించాల్సి ఉంటుంది. ఫలితాలు వెల్లడించిన తేదీ నుంచి 30 రోజుల్లోగా అభ్యర్థులు తమ పూర్తిస్థాయి ఖర్చు వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలి. లెక్కలను సరైన సమయంలో చూపకున్నా వారిపై వేటు పడటంతో పాటు తర్వాత ఎన్నికల్లో పోటీ చేసే హక్కు కోల్పోవాల్సి ఉంటుంది.

ప్రలోభ పెట్టేలా ఖర్చు చేయరాదు..

ఓటర్లను ప్రలోభ పెట్టడం, ప్రభావితం చేసేందుకు అభ్యర్థులు ఎలాంటి ఖర్చు చేయరాదు. తనిఖీల్లో పట్టుబడిన నగదు, సామగ్రి అభ్యర్థిని తేలితే అభ్యర్థుల వ్యయంలో చేరుస్తారు. రోజు వారీగా అభ్యర్థుల ఖర్చుతో పాటు పార్టీ జెండాలు, బ్యానర్లు, కరపత్రాలు, పోస్టర్లు, టోపీలు, కండువాలు, భోజనాలు, వాహనాల అద్దె, ఇంధనం, సభా వేదికలు, మైకులు, పత్రికలు, టీవీ, సోషల్ మీడియా ప్రకటనలకు చేసే ఖర్చును అభ్యర్థి ఎన్నికల వ్యయంగా లెక్కిస్తారు. వీటిలో ప్రతి దానికి బిల్లు సమర్పించాలి.

పెరుగుతున్న వ్యయ పరిమితి..

1952 సాధారణ ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థుల వ్యయ పరిమితి రూ.లక్ష ఉండేది. 2014లో రూ.28 లక్షలు, 2019లో రూ.30 లక్షలు పరిమితిని నిర్ణయించారు. ఇది ప్రస్తుత ఎన్నికల్లో రూ. 40 లక్షలకు చేరింది.

షాడోల్లా నిఘా...

అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలన చేస్తున్న అధికారులు ఆయా ఖర్చులను నియోజకవర్గాల వారీగా షాడో రిజిస్టర్లో నమోదు చేస్తున్నారు. నామినేషన్ తర్వాత అభ్యర్థులు చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని పరిశీలకులు పర్యవేక్షిస్తారు. ప్రచారం, సభలు, సమావేశాలకు ముందుగా అనుమతి తీసుకోవాలి. అధికారులు ఆయా కార్యక్రమాలను పరిశీలించి వీడియోలు తీసుకుంటారు. అభ్యర్థులు పోలింగ్ నాటికి ఖర్చు వివరాలను మూడు పర్యాయాలు అకౌంటింగ్ టీంతో తనిఖీ చేయించుకోవాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

నగదు డిమాండ్ చేసిన వ్యక్తులపై కేసు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): రైతు నాయకులమని చెప్పి ఎన్నికల్లో డబ్బులు కావాలని మా డయాగ్నిస్టిక్ నిర్వాహకులను బెదిరించిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట శివాలయం సమీపంలో ఉన్న మా డయాగ్నిస్టిక్ నిర్వాహకులు మందపల్లి ఆదినారాయణరావు వద్దకు శుక్రవారం కొంత మంది వ్యక్తులు వెళ్లారు. ఎన్నికలకు సంబంధించి తమకు ఫండ్ ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ఈమేరకు ఏలూరి సుధీర్‌రెడ్డి, జన్న జగన్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

తెనాలిరూరల్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి మండలం అంగలకుదురుకు చెందిన వెంకటేశ్వర్లు (29) ఆదివారం ఉదయం గ్రామం వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన ట్రాలీ ఆటో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఘటనలో నందివెలుగు, కంచర్లపాలెం మధ్యలో బైక్‌పై వెళుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని దుగ్గిరాలకు చెందిన జాన్‌వలి (51)గా పోలీసులు గుర్తించారు. రెండు కేసులను రూరల్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఆర్ కానిస్టేబుల్‌ను బలితీసుకున్న కంటైనర్


మోహనరావు (ఫైల్)

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలకసంస్థ పరిధిలోని జాతీయ రహదారిపై కొలనుకొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలీస్ కానిస్టేబుల్ మృతి చెందాడు. తాడేపల్లి ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం కృష్ణాజిల్లా, తిరువూరు మండలం, కొమ్మిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన మారిపోగు మోహనరావు (34) ఎ.ఆర్.కానిస్టేబుల్‌గా డీజీపీ కార్యాలయంలో సీఐడీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. 2018లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన మోహనరావు విధుల నిమిత్తం డీజీపీ కార్యాలయం నుంచి ద్విచక్ర వాహనంపై తన స్నేహితుడు కుంటిపల్లి రాజాతో కలిసి వెళుతుండగా కొలనుకొండ రైల్వే బ్రిడ్జి వద్ద వెనుక నుంచి వచ్చిన కంటైనర్ లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ మోహనరావు కుడివైపు పడిపోగా లారీ టైర్లు శరీరంపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడైన రాజా ఎడమ వైపుకు పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మానవాళి పాపపరిహారం కోసం వచ్చినదే శుభశుక్రవారం

క్రైస్తవ వ్యవహారాల సలహాదారు ఫాదర్ మద్దు బాలస్వామి


శిలువ మోస్తున్న సలహాదారు ఫాదర్ మద్దు బాలస్వామి

గుంటూరు రూరల్: కత్తితో సాధ్యం కానిది కరుణతో సాధించగలం.. కక్షతో సాధించలేనిది క్షమాభిక్షతో సాధించగలం అన్న ఏసు వాక్యాలను ప్రతి ఒక్కరు గుర్తు చేసుకోవాలి.' అని మానవాళి పాప పరిహారమై ఏసుక్రీస్తు తన విలువైన ప్రాణాన్ని శిలువపై అర్పించిన త్యాగాన్ని గుర్తు చేసుకునే సందర్భమే శుభ శుక్రవారం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ క్రైస్తవ వ్యవహారాల సలహాదారు ఫాదర్ మద్దు బాలస్వామి అన్నారు. గుంటూరులోని స్థానిక పెద్ద పలకలూరు ఆర్సీఎం చర్చ్‌లో శుక్రవారం జరిగిన గుడ్ ఫ్రైడే కార్యక్రమంలో ఫాదర్ మద్దు బాలస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే ఏసుక్రీస్తు బోధనలకు అనేక మందిని ఆకర్షణ చేశాయని ఏసు చెప్పిన మార్గం ముఖ్యంగా నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించమని వాక్యాను సారంగా ప్రతిఒక్కరూ సమాజంలోని ఆపదలో ఉన్న వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా ఏసుక్రీస్తు సిలువలో మరణించి ఈ లోకంలోని మానవుని పాప పరిహారార్థం కోసం తన ప్రాణాన్ని అర్పించడం జరిగిందని దాని గుర్తుగా జరుపుకునే గుడ్ ఫ్రైడే వేడుకలలో అనేకమంది క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ఒక మంచి పరిణామం అని ముఖ్యంగా ఏసుప్రభు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. మానవజాతి బాగుకోసం ఏసు శిలువ ఎక్కారని అన్నారు. మానవజాతి పాపాలను పరిహరిస్తూ ఆయన సిలువ మరణం పొంది తిరిగి పునరుద్ధానుడిగా లేచి మరణాన్ని గెలిచిన మానవునిగా చరిత్రలో నిలిచారని అటువంటి ఆదర్శనీయమైన ఏసుక్రీస్తు జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఫాదర్ మద్దు బాలస్వామి సిలువను తన భుజాలపై వేసుకొని కొంత దూరం మోశారు. కార్యక్రమంలో పలువురు సంగతులు సంఘ పెద్దలు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల్లో వైఎస్సార్ సీపీకి పెరిగిన ఆదరణ

- నరసరావుపేట పార్లమెంటు చరిత్ర తిరగరాసేందుకు సిద్ధంకండి
- ఎంపీ అభ్యర్థి కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు
- కండువాలు కప్పి ఆహ్వానించిన అనిల్ కుమార్‌యాదవ్, మంత్రి అంబటి


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి అంబటి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనీల్

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో బడుగు, బలహీన వర్గాల నుంచి వైఎస్సార్ సీపీకి ఆదరణ పెరిగిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం నరసరావుపేట పార్లమెంటు వైఎస్సార్ సీపీ అభ్యర్థి పి.అనిల్ కుమార్ యాదవ్ కార్యాలయంలో సత్తెనపల్లి నియోజకవర్గం పరిధిలోని గుండ్లపల్లి, రెడ్డిగూడెం గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి సత్తెనపల్లి అసెంబ్లీ అభ్యర్థి అంబటి రాంబాబు, ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి అంబటి ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు పార్టీ శ్రేణులకు స్ఫూర్తిదాయకమన్నారు. అనీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలు పేద, బడుగుల తలరాతలు మార్చేవని, పార్లమెంటు పరిధిలో బలహీన వర్గాలకు వచ్చిన రాజకీయ, రాజ్యాధికార అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 20 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరగా వారిలో 19 కుటుంబాలు యాదవ సామాజిక వర్గానికి చెందినవన్నారు. నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన చాకిరి ఏసయ్య, చాకిరి కోటేశ్వరరావు, చాకిరి శివ, బత్తుల రవి, తేటనెల్ల గంగరాజు, తేలుకుట్ల గురవయ్య, కొక్కెర వెంకటేశ్వర్లు, కొండెద్దుల, వెంకటేశ్వర్లు, చాకిరి గురువులు, రాజుపాలెం మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన గౌతకట్ల ఆంజనేయులు, గుర్రం ఆంజనేయులు, కృష్ణాంజనేయులు, దూడల ఆంజనేయులు గోపి, గుర్రంశ్రీను, గౌతకట్ల మల్లికార్జునరావు పార్టీలో చేరారు. కష్టపడి పనిచేసి, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వారిని అభినందించారు. నకరికల్లు మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి,, రాజుపాలెం మండల నాయకులు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ పార్లమెంట్ అభ్యర్థిగా జగన్మోహనరావు

చీరాల రూరల్: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా చీరాల పట్టణం విఠల్ నగర్‌కు చెందిన డాక్టర్ డొక్కా జగన్మోహనరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి, రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి తన పేరును ప్రకటించారని జగన్మోహనరావు తెలిపారు. మచిలీపట్నంలో అధ్యాపకుడిగా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా, హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్‌గా వివిధ హోదాలలో 32 సంవత్సరాలు పని చేశానన్నారు. 2012లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ చేసి గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు పేర్కొన్నారు ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు కూడా చేపట్టినట్లు చెప్పారు. ఉద్యోగ విరమణ అనంతరం బీఎస్పీలో చేరి బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగినట్లు పేర్కొన్నారు. తనపై నమ్మకముంచి ఎంతో బాధ్యతపెట్టిన పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి, రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బహుజనులతోనే రాజ్యాధికారం సాధ్యం అనే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తానని చెప్పారు.

ముగ్గురు పోలీస్ అధికారులకు ఉగాది పురస్కారాలు


జిల్లా ఏఎస్పీ క్రైం శ్రీనివాసరావు


ఎస్‌బీ డీఎస్పీ పోతురాజు


దక్షిణ డీఎస్పీ మహబూబ్‌బాషా

నగరంపాలెం: ఉగాది పురస్కారాలకు జిల్లా ఏఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ పోతురాజు, దక్షిణ డీఎస్పీ మహబూబ్‌బాష ఎంపికయ్యారు. పోలీస్ శాఖలో అందించిన సేవలకుగాను ఈ ఏడాదిలో రానున్న ఉగాది పండుగకు ఈ పురస్కారాలను అందజేయనున్నారు. ఈ క్రమంలో ఆ ముగ్గురికి జిల్లా పోలీస్ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఇక ఎస్‌బీ డీఎస్పీ పోతురాజు రాష్ట్ర డీజీపీ బ్రోంజ్ డిస్క్ అవార్డుకు కూడా ఎంపిక చేశారు. ఒకేసారి ఆయన రెండు అవార్డులకు ఎంపికకావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గుండ్లకమ్మ–దర్శి రైల్వేలైన్‌కు పచ్చజెండా

- నడికుడి– శ్రీకాళహస్తి సెక్షన్ మధ్య మరో 27 కిలోమీటర్లు ట్రాక్ పూర్తి
- కొత్త రైల్వే లైన్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మాణం
- వివరాలు వెల్లడించిన డీఆర్ఎం రామకృష్ణ




గుండ్లకమ్మ -దర్శి మార్గంలో నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న ఆర్‌యూబీ

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుండ్లకమ్మ–దర్శి మధ్య 27 కిలోమీటర్ల మేర కొత్త రైలు మార్గాన్ని పూర్తిచేసి రైళ్ల రాకపోకలను ప్రారంభించడం జరిగిందని గుంటూరు రైల్వే డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కొత్త రైల్వే లైన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నడికుడి– శ్రీకాళహస్తి మధ్య కొత్త రైల్వే లైన్ ప్రాజెక్ట్‌లో భాగమన్నారు. విద్యుద్దీకరించని రైలు విభాగంలోని రైళ్లు గరిష్టంగా 75 కి.మీ. వేగంతో నడపడానికి అనుమతి లభించిందని తెలిపారు. నడికుడి– శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్ ప్రాజెక్ట్ దక్షిణ మధ్య రైల్వే ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేపట్టిన ముఖ్యమైన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఒకటి అని తెలిపారు. ఇది గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని పరిసర ప్రాంతాల్లోని అనేక కొత్త ప్రాంతాలను రైలు నెట్‌వర్క్‌తో మొదటిసారిగా కలుపుతుందన్నారు. ఈ ప్రాజెక్టు 2011–12 సంవత్సరంలో 309 కి.మీ.ల మేర రూ. 2,289 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైందని చెప్పారు. రైల్వే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య 50% వ్యయ భాగస్వామ్య ప్రాతిపదికతో పాటు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ 5 దశల్లో అమలు చేయబడుతుందని వివరించారు.

మాకు న్యాయం కావాలి

భర్త ఇంటి ముందు ముగ్గురు ఆడపిల్లలతో భార్య ఆందోళన


ముగ్గురు పిల్లలతో విలపిస్తున్న సయ్యద్ సాజిదా


కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాలతో భర్త ఇంటి ముందు సాజిదా ధర్నా

పిడుగురాళ్ల: ముగ్గురు ఆడ పిల్లలు సంతానం. మగ పిల్లాడి కోసం రెండో పెళ్లి చేసుకుంటానంటూ తరచూ భార్యకు మానసిక, శారీరక హింస. ఆమెను వదిలించుకోవాలని చూస్తున్న భర్త ఇంటి ముందు భార్య, తన పిల్లలు, బంధువులు, ప్రజా సంఘాలతో శుక్రవారం నిరసనకు దిగింది. కాపురానికి తీసుకెళ్లకుండా పుట్టింటిలోనే భర్త వదిలేశాడంటూ కన్నీరు పెట్టుకుంది. భర్త నుంచి న్యాయం జరగాలంటూ అక్కడే బైఠాయించి ఆందోళన చేపట్టింది. ఈ ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగింది. బాధితురాలు సయ్యద్ సాజిదా మాట్లాడుతూ.. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన సయ్యద్ ఖాజా మసూద్‌తో ఎనిమిదేళ్ల క్రితం తనకు వివాహం అయ్యిందని, ముగ్గురు ఆడపిల్లలు పుట్టారని తెలిపింది. అప్పటి నుంచి తరచూ తనను అనుమానిస్తూ మానసికంగా, శారీరకంగా భర్త హింసిస్తున్నాడని వాపోయింది. ఈ క్రమంలో నాలుగైదు సార్లు తన తల్లిదండ్రులు నచ్చజెప్పి కాపురానికి పంపారని పేర్కొంది. అయినా భర్తలో ఎలాంటి మార్పు రాలేదని చెప్పింది. తనను ఎనిమిది నెలల క్రితం పిడుగురాళ్ల పట్టణంలోని పుట్టింట్లో వదిలి వెళ్లాడని, తిరిగి కాపురానికి తీసుకెళ్లేందుకు ఇప్పటి వరకు రాలేదని తెలిపింది. ఎప్పుడు అడిగినా 'నాకు నువ్వు వద్దు, నాకు వారసుడు కావాలి, నేను రెండో పెళ్లి చేసుకుంటా.' అంటూ చెప్తున్నాడని ఆందోళన చెందింది. కావాలంటే ముగ్గురు ఆడ పిల్లలకు రూ.3వేలు ఇస్తానని, తనను వదిలి వెళ్లిపోవాలని అంటూ భర్త ఖాజా మసూద్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని భార్య సయ్యద్ సాజిదా వివరించింది. దీనిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అప్పటి నుంచి తన భర్త పోలీసులకు దొరకకుండా తిరుగుతున్నాడని ఆమె చెప్పింది. ఇప్పుడు తను, తన ముగ్గురు పిల్లలు ఎమై పోవాలంటూ కన్నీరుమున్నీరై విలపించింది. తల్లిదండ్రులు ఫైజూన్, బాజీతో పాటు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి భర్త ఖాజా మసూద్ ఇంటి ముందు బైఠాయించింది. పట్టణ పోలీసులు ఖాజా మసూద్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

ఫుట్‌బాల్ బాలుర జిల్లా జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో పీడీలు

సత్తెనపల్లి: అండర్ -20 ఫుట్‌బాల్ బాలుర జిల్లా జట్టును మండలంలోని సుగాలి కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఎంపిక చేశారు. నంబూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శనివారం నుంచి ఏప్రిల్ 3 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరగనుంది. ఈ సందర్భంగా శిక్షణ శిబిరానికి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహించారు. 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జట్టులో షేక్ నాగ నజీర్(నరసరావుపేట), సయ్యద్ ఖాజా పీర్(నరసరావుపేట), దాసరి శివ సాయి శ్రీకృష్ణ (సత్తెనపల్లి), నూరు బాషా ఖాశిం మహ్మద్(సత్తెనపల్లి), బొంతా అంకమ్మరావు(మాదల), మల్లెం చిన్న వెంకటేష్(సత్తెనపల్లి), పఠాన్ యాసిన్‌ఖాన్(మాదల), ఏసుపోగు సామ్యేల్ (సత్తెనపల్లి), మంగపురం విశాఖవర్ధన్(సత్తెనపల్లి), దార్ల సాయికుమార్ (నరసరావుపేట), మూర్తి ముఖేష్(పిడుగురాళ్ళ), కృష్ణం ఆకాష్(ఇరుకుపాలెం), షేక్ నాగషరీఫ్ (నరసరావు పేట), సయ్యద్‌రవుఫ్(నరసరావుపేట), పగిడిపల్లి శివ మణి(సత్తెనపల్లి), యానం శిగ నాగగణేష్ (మాదల), చింతలపూడి రాజు(మాదల), కుందా పవీన్‌కుమార్(మాదల), కొత్త పల్లి శ్యామ్‌కుమార్(మాదల), కొండవటి నరేష్(మాదల), గొర్రెపాటి ప్రదీప్ (మాదల), పగిడిపల్లి రవికుమార్(సత్తెనపల్లి), గుడిగుంట్ల ప్రసన్నకుమార్ (ఇరుకు పాలెం), నల్లబోతుల మోహన్ కృష్ణ(సత్తెనపల్లి)లు ఎంపికయ్యారు. ఎంపిక ప్రక్రియలో పల్నాడు జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ అసిస్టెంట్ సెక్రటరీ ఎ.శ్రీరామ్‌రెడ్డి, పీడీలు ఐఎస్ నాగిరెడ్డి, సుబ్రహ్మణ్యేశ్వరరావు, షేక్ ఎండి రియాజ్, ఎస్ఎం .సుభాని, అచ్చిరెడ్డి, షేక్ జాన్ సైదా, పి.శ్రీనివాస్ రెడ్డి, శివ గోవర్ధన పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

అద్దంకి రూరల్: బైకు నడుపుతూ కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన శుక్రవారం మండలంలోని ధేనువుకొండ గ్రామ సమీపంలో జరిగింది. మండలంలోని బలరామ కృష్ణాపురం గ్రామానికి చెందిన పాలపర్తి ఏసోబు (45) ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ధేనువుకొండ గ్రామానికి వెళ్తున్న సమయంలో బైకుపై నుంచి ఒక్కసారిగా కిందపడ్డాడు. స్థానికులు గమనించి చూడగా అప్పటికే మృతి చెందాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య

చిలకలూరిపేట టౌన్: వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తిని హత్య చేసిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని మురికిపూడి గ్రామానికి చెందిన ఎద్దు ఏసుబాబు (41) ఎలక్ట్రీషియన్‌గా జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన సూరబోయిన మురళీకృష్ణ వద్ద పనికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఏసుబాసు భార్యతో మురళీకృష్ణ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం ఏసుబాబు తెలుసుకున్నాడు. గురువారం సాయంత్రం గ్రామ శివారులోని పొలాల్లో మురళీకృష్ణతో మద్యం సేవిస్తుండగా.. ఈ విషయమై వాగ్వాదానికి దిగాడు. ఈ నేపథ్యంలో మురళీకృష్ణ తన స్నేహితుడు ఏసుబాబుతో కలసి ఎద్దు ఏసుబాబును హత్య చేశారు. ఏసుబాబు మృతిపై అతని సోదరి సువార్తమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చేనేతలకు ఊపిరిలూదిన సీఎం జగన్


అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్‌ను సత్కరిస్తున్న చేనేత నాయకులు

చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్

చీరాల టౌన్: చేనేతలకు ఊపిరిలూదిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మండలంలోని ఈపూరుపాలెం పంచాయతీ పరిధిలో శుక్రవారం చేనేతల ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకటేష్ హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం చేనేతలను గాలికొదిలేసి అనేక మంది ఆత్మహత్యలకు కారణమైందని విమర్శించారు. చేనేత కుటుంబాలకు తానున్నానంటూ సీఎం జగన్ ఆదుకున్నారన్నారు. ఏటా రూ.24 వేలు అందించి వారికి అభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. ఈ ఐదేళ్లలో కోట్ల రూపాయలు నేరుగా అందించి చేనేతల్లో ఆనందం నింపారని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక సీఎం జగనన్నే అని కొనియాడారు. నియోజకవర్గంలో చేనేత కుటుంబాలు జగనన్నే వెంటే ఉన్నారని వెంకటేష్ తెలిపారు.

చేనేతలపై అసభ్యకర మాటలు బాధాకరం

సమాజంలో చేనేతల సేవ ఎంతో గొప్పదన్నారు. మనం కట్టే ప్రతి వస్త్రం వారి చలవేనన్నారు. అటువంటి చేనేతలపై టీడీపీ నాయకుల అసభ్యంగా మాట్లాడటం సమంజసం కాదని ఖండించారు. చేనేతలను ఎవరైనా దూషిస్తే సహించమని హెచ్చరించారు. చేనేతల సమస్యల్ని తన దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో చీరాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడం ఖాయమని, మళ్లీ సీఎంగా జగనన్నే ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. చీరాలలో తనను ఎమ్మెల్యేగా, సీఎంగా జగనన్నను ఆశీర్వదించాలని ఆయన కోరారు. అనంతరం వెంకటేష్‌ను చేనేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షుడు ఆసాది అంకల రెడ్డి, చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, బిట్రా శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నల్లబోతుల రాజ్ మార్, జిల్లా కార్యదర్శి బండారు శివ పార్వతి, పాలపర్తి నాగేశ్వరరావు, మాచర్ల ఆంజనేయులు, బూదాటి భావనర్షి, దామర్ల శివయ్య, బండారు బాల, నందం భాస్కరరావు, పొట్టేటి సుబ్బయ్య, చెన్నంశెట్టి సుందరరామయ్య, ఆకురాతి సుబ్రమణ్యం, కూరపాటి నరసింహారావు, కొర్నిపాటి శ్రీనివాసరావు, జి. కేశవరావు, గట్టు రామ్మోహనరావు, ఆకురాతి కోటేశ్వరరావు, ముట్టే శేషులు, మాజీ కోఆప్షన్ సభ్యుడు మస్తాన్, షేక్ సుభాని, గోలి గిరి, దేవరకొండ లీలాకృష్ణ, రామనాథం కేశవ, పొట్టేటి వెంకటసుబ్బయ్య, మేరవ శ్రీనివాసరావు, దేవరపల్లి నరేష్, కొంగత వీరలంకయ్య, జి.బాబూరావు, పాండురంగ గుడి దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
30-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 655	73,651
నిఫ్టీ ▲ 203	22,327

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,379	▼	20
డోజోన్స్	39,807	▲	47
ఎఫ్‌టీఎస్ఈ 100	7,953	▲	21
డాక్స్	18,492	▲	15
షాంఘై	3,041	▲	30
నికాయ్	40,369	▲	201

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.95	93.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.23	106.78
€	యూరో	ఎస్‌బీఐ	89.30	91.68
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.64	55.75
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.64	55.56
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.64	64.35
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.30	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.78	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.49



దేశంలో ఆధ్యాత్మిక టూరిజం జోష్

రిటైల్ బ్రాండ్స్ ప్రత్యేక దృష్టి • లిస్టులో తిరుపతి, అయోధ్య, వారణాసి

న్యూఢిల్లీ: ఆధ్యాత్మిక పర్యాటకంపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో బడా రిటైల్ బ్రాండ్లు ఆధ్యాత్మిక కేంద్రాలపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. భక్తుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను అందించే దిశగా తిరుపతి, అయోధ్య, వారణాసి, అమృత్‌సర్, పూరి, అజ్మీర్ వంటి నగరాల్లో గణనీయంగా విస్తరిస్తున్నాయి. 14 కీలక నగరాల్లో పెరుగుతున్న ఆధ్యాత్మిక టూరిజంతో వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రిటైల్ చెయిన్స్ అనుసరిస్తున్న వ్యూహాలపై రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్ఈ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. మదురై, గురువాయూర్, ద్వారకా, మధురా తదితర నగరాల్లో కూడా రిటైల్ బూమ్ కనిపిస్తున్నట్లు రిపోర్టు పేర్కొంది. పేరొందిన మాల్స్‌తో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కూడా టూరిస్టులను ఆకర్షించేలా తమ బ్రాండ్లను ప్రదర్శించడంపై రిటైల్ సంస్థలు దృష్టి పెడుతున్నాయి. అయోధ్యలో మాన్యవర్, రిలయన్స్ ట్రెండ్స్, రేమండ్స్, మార్కెట్99, ప్యాంటలూన్స్, డామినోస్, పిజ్జా హట్, రిలయన్స్ స్మార్ట్ మొదలైనవి తమ రిటైల్ స్టోర్స్ ప్రారంభించినట్లు నివేదిక వివరించింది. వారణాసిలో జుడియో, షాపర్స్ స్టాప్, బర్గర్ కింగ్ తదితర సంస్థలు కూడా కార్యకలాపాలు విస్తరించినట్లు పేర్కొంది. టూరిజంను ప్రోత్సహించేందుకు, కనెక్టివిటీని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆధ్యాత్మిక పర్యాటకానికి ఊతం లభిస్తున్నట్లు సీబీఆర్ఈ చైర్మన్ అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. ఫ్యాషన్, ఫుడ్ అండ్ బెవరేజెస్, హైపర్‌మార్కెట్లు మొదలైన సంస్థలన్నీ కూడా భక్తుల అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులను అందిస్తూ కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు వివరించారు. ఆధ్యాత్మిక టూరిజం ట్రెండ్‌తో ఆయా ప్రాంతాల్లో ఆతిథ్య, రిటైల్ రంగాలకు కలిసి వస్తోందని సీబీఆర్ఈ ఇండియా ఎండీ రామ్ చంద్నానీ తెలిపారు.

ఎఫ్‌పీఐల భారీ పెట్టుబడులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 3.4 లక్షల కోట్లు ఇన్వెస్ట్‌మెంట్



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సవాళ్లతో కూడుకున్న పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉన్న నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మళ్లీ ఇటువైపు చూస్తున్నారు. డిపాజిటరీల డేటా ప్రకారం 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీల్లో ఏకంగా రూ. 2 లక్షల కోట్లు పైగా ఇన్వెస్ట్ చేశారు. డెట్ మార్కెట్లో రూ. 1.2 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టారు. మొత్తం మీద భారత క్యాపిటల్ మార్కెట్లో రూ. 3.4 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అంతక్రితం రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఈక్విటీల నుంచి ఎఫ్‌పీఐలు పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. 2020–21లో ఏకంగా రూ. 2.74 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు ఆ మరుసటి సంవత్సరం రూ. 1.4 లక్షల కోట్లు, ఆ తర్వాత 2022–23లో రూ. 37,632 కోట్లు వెనక్కి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 2023–24లో భారీగా ఇన్వెస్ట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సానుకూలంగా కొత్త ఏడాది..

కొత్త ఆర్థిక సంవత్సరంపై కూడా అంచనాలు కాస్త సానుకూలంగానే ఉన్నాయని భారత్‌లో మజార్స్ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ భరత్ ధావన్ తెలిపారు. పురోగామి పాలసీ సంస్కరణలు, ఆర్థిక స్థిరత్వం, ఆకర్షణీయమైన పెట్టుబడి మార్గాల కారణంగా దేశంలోని ఎఫ్‌పీఐల ప్రవాహం స్థిరంగా కొనసాగవచ్చని పేర్కొన్నారు. అయితే, అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అంశాల కారణంగా మధ్యమధ్యలో ఒడిదుడుకులు ఉండవచ్చన్నారు.

300 నగరాల్లో కియా కేంద్రాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కియా ఇండియా విక్రయ, సర్వీస్ కేంద్రాలను విస్తరిస్తోంది. కియా 2.0 వ్యూహంలో భాగంగా డిసెంబర్‌కల్లా 300 నగరాలు, పట్టణాల్లో అడుగు పెట్టడం ద్వారా టచ్ పాయింట్స్ సంఖ్యను 700లకు చేరుస్తామని ప్రకటించింది. ప్రస్తుతం 236 నగరాలు, పట్టణాల్లో కంపెనీకి 522 సేల్స్, సర్వీస్ సెంటర్స్ ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

30-3-2024 ఫామ్ ధర...

విశాఖ	415–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400–00
విజయవాడ	400–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	375–00
వరంగల్	377–00
రిటైల్ ధర	4.35

ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌లో వాటా విక్రయం

బ్యాంక్ నుంచి వార్‌బర్గ్ పింకస్ ఔట్

న్యూఢిల్లీ: పీఈ దిగ్గజం వార్‌బర్గ్ పింకస్ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ నుంచి పూర్తిగా వైదొలగింది. తాజాగా బ్యాంకులోగల మొత్తం 2.25 శాతం వాటాను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 75.24 సగటు ధరలో 15.88 కోట్ల బ్యాంకు షేర్లను అమ్మివేసింది. వీటి విలువ రూ. 1,195 కోట్లుకాగా.. క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా 2023 డిసెంబర్‌కల్లా ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో 2.25 శాతం వాటాను కలిగి ఉంది. అయితే కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. గతేడాది సెప్టెంబర్‌లోనూ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో 4.2% వాటాను వార్‌బర్గ్ పింకస్ రూ. 2,480 కోట్లకు విక్రయించిన విషయం విదితమే. కాగా.. గురువారం బీఎస్ఈలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేరు 3.1% క్షీణించి రూ. 75.4 వద్ద ముగిసింది.

హైరింగ్ ప్రణాళికల్లో స్టోరబుల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సెల్ఫ్–స్టోరేజ్ టెక్నాలజీ సొల్యూషన్స్ అందించే అమెరికన్ సంస్థ స్టోరబుల్ భారత్‌లో తమ కార్యకలాపాలు విస్తరిస్తోంది. హైదరాబాద్‌లో 15వేల చ.అ. విస్తీర్ణంలో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. గతేడాదే హైదరాబాద్‌లో తమ ఏషియా జీసీసీని స్టోరబుల్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇక్కడ 60 మంది ఉద్యోగులు ఉండగా, ఈ ఏడాది ఆఖరు నాటికి ఈ సంఖ్యను 120కి పెంచుకోనున్నట్లు సంస్థ ప్రెసిడెంట్ చార్లీ మారియట్ తెలిపారు. ఇంజనీరింగ్, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ విభాగాల్లో నియామకాలు చేపట్టనున్నట్లు వివరించారు.

చిన్న షేర్ల పెద్ద ర్యాలీ

60 శాతానికి మించి రాబడులు • 2023–24లో రిటైల్ ఇన్వెస్టర్ల హవా

న్యూఢిల్లీ: దలాల్ స్ట్రీట్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023 –24)లో రిటైల్ ఇన్వెస్టర్ల హవా కొనసాగింది. దేశంలో దృఢమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, ఆకర్షణీయమైన కార్పొరేట్ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో రిటైల్ ఇన్వెస్టర్లు చిన్న, మధ్య స్థాయి షేర్లను కొనేందుకు అధిక ఆసక్తి చూపారు. 2023–24లో బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 62%, స్మాల్ క్యాప్ సూచీ 60% రాణించాయి. ఇదే కాలంలో బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 25% పెరిగింది.

''ఆదాయాలు గణనీయంగా పెరగడం, అధిక వృద్ధి అవకాశాలతో రిటైల్ ఇన్వెస్టర్లు చిన్న, మధ్య తరహా షేర్లను కొనుగోలుకు ఆసక్తి చూపారు. లార్జ్ క్యాప్ షేర్ల పట్ల విముఖత చూపారు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో నికర పెట్టుబడులు పెరగడం ఇందుకు నిదర్శనం. ఆర్థిక విస్తరణ సమయంలో చిన్న, మధ్య తరహా షేర్ల వృద్ధి వేగంగా ఉంటుందనే సంప్రదాయ సూత్రాన్ని వారు విశ్వసించారు. అంతేకాకుండా స్మాల్, మిడ్ సైజ్ కంపెనీల అద్భుతమైన త్రైమాసిక ఫలితాలు వారిని కొనుగోళ్ల వైపు ఆకర్షితం చేశాయి'' అని హెడ్జ్ ఫండ్ హెడోనోవా సీఐఓ సుమన్ బెనర్జీ తెలిపారు.



- 2023-24లో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫిబ్రవరి 8న 40,282 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. గతేడాది మార్చి 31న 23,881 వద్ద ఏడాది కనిష్టానికి తాకింది.
- ఇదే కాలంలో బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ ఫిబ్రవరి 7న 46,821 వద్ద ఆల్‌టైం హైని నమోదు చేయగా, గతేడాది మార్చి 31న 26,692 వద్ద 52 వారాల కనిష్టాన్ని తాకింది.
- సెన్సెక్స్‌తో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చిన్న, మధ్య స్థాయి షేర్ల అత్యుత్తమ ప్రదర్శన భారత ఈక్విటీ మార్కెట్ క్రియాశీలక స్వభావాన్ని, ఇన్వెస్టర్ల అపార వృద్ధి అవకాశాలను ప్రతిబింబిస్తుందని స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ ఎండీ సునీల్ న్యాతీ తెలిపారు.
- వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ చిన్న, మధ్య తరహా షేర్ల ర్యాలీ కొనసాగుతుందని న్యాతీ అభిప్రాయపడ్డారు. "సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వమే తిరిగి అధికారాన్ని దక్కించుకోవచ్చనే అంచనాలతో వ్యాపార అనుకూల వాతావరణం పెంపొంది స్థిరమైన వృద్ధి కొనసాగొచ్చు. దీనికి తోడు భారత వృద్ధి బలమైన అవుట్‌లుక్ అంచనాలు ఈ రంగాల షేర్లకు డిమాండ్‌ను పెంచుతాయి" న్యాతీ తెలిపారు. అయితే కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల పెంపు, అంతర్జాతీయ అనిశ్చితులు, లాభాల స్వీకరణ వంటి అంశాలు స్వల్పకాలిక ఒడిదుడుకులకు దారితీయొచ్చన్నారు.

ఐపీవో బాటలో ఆఫ్కన్స్ ఇన్‌ఫ్రా

ఆఫ్కన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఈ షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ కంపెనీ ఐపీవోతో రూ. 7,000 కోట్లు సమకూర్చుకోనుంది.

రూ. వెయ్యి కోట్లకు జిరోధా ఫండ్ విలువ

జిరోధా, స్మాల్‌కేస్ జేవీ జిరోధా ఫండ్ హౌస్ నిర్వహణలోని ఆస్తుల విలువ కేవలం 40 రోజుల్లో రూ. 500 కోట్ల మేర ఎగిసింది. దీంతో సంస్థ ఏయూఎం రూ. 1,000 కోట్ల మార్కును దాటింది.

సినిమా

డిసెంబరులో ఆరంభం



• ప్రభాస్

ఈ ఏడాది డిసెంబరులో పోలీసాఫీసర్‌గా ప్రభాస్ చార్జ్ తీసుకోనున్నారని తెలిసింది. హీరో ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో 'స్పిరిట్' అనే చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో సిన్సియర్ పోలీసాఫీసర్ పాత్రలో నటించనున్నారు ప్రభాస్. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఈ ఏడాది డిసెంబరులో ఆరంభించేలా ప్లాన్ రెడీ చేస్తున్నారట సందీప్ రెడ్డి వంగా. ఇక ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం రష్మికా మందన్నా, కీర్తీ సురేష్, మృణాల్ ఠాకూర్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించనున్నారు. భూషణ్ కుమార్ నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది చివర్లో లేదా 2026 ప్రారంభంలో రిలీజ్ అయ్యే అవకాశం కనిపిస్తోంది.

టీజర్ రెడీ



• అల్లు అర్జున్

'పుష్ప : ది రూల్' సినిమా టీజర్‌కు రంగం సిద్ధమౌతున్నట్లుగా తెలుస్తోంది. హీరో అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఏప్రిల్ 8న 'పుష్ప: ది రూల్' సినిమా టీజర్‌ను రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లుగా తెలిసింది. సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఫాహద్ ఫాజిల్, అనసూయ, సునీల్, జగపతిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్త. 'పుష్ప: ది రూల్' సినిమా ఈ ఏడాది ఆగస్టు 15న విడుదల కానుంది. ఇక 'పుష్ప' సినిమా ఫ్రాంచైజీలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సినిమా సక్సెస్ కావడంతో మలి భాగం 'పుష్ప: ది రూల్'పై భారీ అంచనాలు ఉన్నాయి. మరోవైపు దర్శకుడు త్రివిక్రమ్, మరో దర్శకుడు సందీప్ రెడ్డి వంగాలతో అల్లు అర్జున్ సినిమాలు కమిటైన సంగతి తెలిసిందే. ఈ చిత్రాల అప్‌డేట్స్ కూడా అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఏప్రిల్ 8న వచ్చే అవకాశం ఉంది. ఇంకా అల్లు అర్జున్–దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లోని కొత్త సినిమా ప్రకటన కూడా రావొచ్చనే ప్రచారం జరుగుతోంది.

ఆలియాకు విలన్‌గా...?



• బాబీ డియోల్

ఆలియా భట్, షార్వరి లీడ్ రోల్స్‌లో ఓ స్పై యాక్షన్ థ్రిల్లర్ సినిమా తెరకెక్కనుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తున్న సంగతి తెలిసిందే. యశ్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న ఈ సినిమాలో బాబీ డియోల్ విలన్‌గా నటించనున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ ఏడాది చివర్లోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందట. శివ్ రావైల్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, ఆదిత్యా చోప్రా ఈ సినిమాను నిర్మించనున్నారు. గతంలో 'రాజీ' సినిమాలో స్పై పాత్రలో నటించిన ఆలియా భట్ మళ్లీ ఈ సినిమాలో ఆ తరహా పాత్రను ఓకే చేయడం విశేషం. ఇక 'యానిమల్'లో విలన్ రోల్‌లో బాబీ డియోల్ విజృంభించిన విషయం తెలిసిందే. మరి.. యశ్ రాజ్ ఫిలింస్ తాజా చిత్రంలో విలన్‌గా సై అంటే... మరోసారి బాబీ నెగటివ్ పెర్ఫార్మెన్స్‌ని చూసే వీలు దక్కుతుంది.

ఇటు మెకానిక్ రాకీ.. అటు లైలా!





• బనితా సంధు

బర్త్ డే (మార్చి 29) రోజున హీరో విశ్వక్ సేన్ డబుల్ ధమాకా అందుకున్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించనున్న రెండు కొత్త సినిమాల వివరాలను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. విశ్వక్ టైటిల్ రోల్‌లో నటించనున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించనున్న ఈ సినిమాలో నరేశ్, 'వైవా' హర్ష, హర్షవర్ధన్ కీలక పాత్రల్లో నటిస్తారు. రవితేజ ముళ్లపూడిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, రామ్ తాళ్లూరి నిర్మించనున్నారు. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ లుక్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమాకు జేక్స్ బిజోయ్ స్వరకర్త. అలాగే విశ్వక్ సేన్ హీరోగా నటించనున్న మరో సినిమా 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మించనున్నారు. ఈ సినిమాలో సెకండాఫ్‌లో లైలా అనే అమ్మాయిగా విశ్వక్ కనిపిస్తారని తెలిసింది. ఈ సినిమాకు తనిష్క్ బాగ్చి మ్యూజిక్ డైరెక్టర్. ఈ సినిమాలే కాకుండా విశ్వక్‌సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' అనే సినిమా చేస్తున్నారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం మే 17న విడుదల కానుంది.

అందరూ కనెక్ట్ అవుతారు




• రుహానీ శర్మ

సుహాస్, కార్తీక్ రత్నం, రుహానీ శర్మ, విరాజ్ అశ్విన్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'శ్రీరంగనీతులు'. ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకత్వంలో వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మించిన ఈ చిత్రాన్ని ఏప్రిల్ 11న పంపిణీదారుడు, నిర్మాత ధీరజ్ మొగిలినేని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ సినిమాకు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారని శుక్రవారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో చిత్ర యూనిట్ పేర్కొంది.

ఆస్కార్ విజేత లూయిస్ గోసెట్ కన్నుమూత

హాలీవుడ్‌లో విషాదం చోటు చేసుకుంది. అమెరికన్ ప్రముఖ నటుడు, ఆస్కార్ అవార్డు విజేత లూయిస్ గోసెట్ జూనియర్ (87) కాలిఫోర్నియాలో కన్నుమూశారు. లూయిస్ మరణాన్ని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించినట్లుగా హాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. ఇక 1936లో లూయిస్ గోసెట్ సీనియర్, హెలెన్ రెబక్కా దంపతులకు మే 27న న్యూయార్క్‌లో జన్మించారు లూయిస్ గోసెట్ జూనియర్. చిన్నతనంలోనే లూయిస్‌కు నటన పట్ల ఆసక్తి ఉండేది. అలా 17ఏళ్ల వయసులోనే రంగస్థల నటుడిగా మారాడు లూయిస్. ఆ తర్వాత సినిమాల్లోకి వచ్చారు. 'ఎ రైసిన్ ఇన్ ది సన్, ది బ్లాక్స్, ది పనిషర్, స్కిన్‌గేమ్' వంటి సినిమాల్లో నటించారు. 'ది బుక్ ఆఫ్ నీగ్రోస్' వంటి టెలివిజన్ సిరీస్‌లలో కూడా నటించారు లూయిస్. ఇక 1982లో వచ్చిన 'యాన్ ఆఫీసర్ అండ్ ఏ జెంటిల్‌మేన్' సినిమాలోని నటనకుగాను 55వ ఆస్కార్ అవార్డ్స్‌లో లూయిస్ ఉత్తమ సహాయ నటుడు విభాగంలో అవార్డు అందుకున్నారు. కాగా ఈ విభాగంలో ఆస్కార్ అవార్డు అందుకున్న తొలి నల్లజాతి నటుడు లూయిస్‌నే అని హాలీవుడ్ సమాచారం. అలాగే ఇదే సినిమాకు ఉత్తమ సహాయ నటుడు విభాగంలో గోల్డెన్ గ్లోబ్ అవార్డు కూడా దక్కించుకున్నారు. 1977లో వచ్చిన మినీ సిరీస్ 'రూట్స్'లోని నటన లూయిస్‌కి మంచి పేరు తెచ్చిపెట్టడంతో పాటు ఎమ్మీ అవార్డు కూడా అందుకునేలా చేసింది.



స్పైతో బనితా ఎంట్రీ

'అక్టోబర్, సర్దార్ ఉదమ్' వంటి హిందీ చిత్రాలతో, తమిళ చిత్రం 'ఆదిత్య వర్మ'తో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు బనితా సంధు. ఈ బ్యూటీ 'జీ 2' (గూఢచారి 2) చిత్రంతో పాన్ ఇండియా ప్రేక్షకులకు పరిచయం కానున్నారు. అడివి శేష్ హీరోగా రూపొందిన సూపర్ హిట్ ఫిల్మ్ (2018) 'గూఢచారి'కి సీక్వెల్‌గా పాన్ ఇండియా స్థాయిలో 'జీ 2' తెరకెక్కుతోంది. గూఢచారిగా హీరో అడివి శేష్ నటిస్తున్నారు. ఈ స్పై సరసన బనితా సంధు హీరోయిన్‌గా నటిస్తున్నారు. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ గుజరాత్‌లోని భుజ్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో బనితా జాయిన్ అయిన విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ''శేష్, బనితాలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. తెరపై ఇద్దరి కెమిస్ట్రీ అద్భుతంగా ఉంటుంది. హై ఆక్టేన్ యాక్షన్ మూవీగా ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ''ఈ చిత్రంలో నటించడం క్రియేటివ్‌గా నాకు చాలా హ్యాపీగా ఉంది. ఇప్పటివరకూ చేయని పాత్రను ఈ చిత్రంలో చేస్తున్నాను'' అని బనితా సంధు అన్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ కీలక పాత్ర చేస్తున్నారు.

కథ రెడీ అవుతోంది!



టామ్‌క్రూజ్

హాలీవుడ్ ఫిల్మ్ 'టాప్‌గన్' ఫ్రాంచైజీ నుంచి మూడో భాగం 'టాప్‌గన్ 3' సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదటి రెండు భాగాలు 'టాప్‌గన్', 'టాప్‌గన్: మావెరిక్' లో హీరోగా నటించిన టామ్ క్రూజ్‌యే 'టాప్ గన్ 3'లోనూ హీరోగా నటించనున్నారని తెలుస్తోంది. ''టాప్‌గన్ 3' బేసిక్ కథ సిద్ధంగా ఉంది. టామ్ క్రూజ్‌కు స్టోరీలైన్ చెప్పాం. ఆయన నచ్చిందని చెప్పారు. కథకు మెరుగులు దిద్దే పనిలో ఉన్నాం'' అని 'టాప్‌గన్' ఫ్రాంచైజీ నిర్మాతల్లో ఒకరైన జెర్రీ బ్రూమ్ హైమర్ పేర్కొన్నారు.

వేసవిలో వస్తున్నా డియర్



• జీవీ ప్రకాశ్, ఐశ్వర్య

ఒక కుటుంబంలో ఓ సమస్య వస్తుంది? ఆ సమస్యను ఆ కుటుంబం ఎలా పరిష్కరించింది? వివాహ బంధం సుదీర్ఘంగా సాగడానికి ఏం అవసరం? వంటి అంశాలతో రూపొందిన చిత్రం 'డియర్'. జీవీ ప్రకాశ్‌కుమార్, ఐశ్వర్యా రాజేశ్ జంటగా ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా ఒక్క రోజు గ్యాప్‌లో విడుదల కానుంది. తమిళ వెర్షన్ ఏప్రిల్ 11న, తెలుగు వెర్షన్ ఏప్రిల్ 12న విడుదల కానున్నాయి. తెలుగు వెర్షన్ ఆంధ్ర హక్కులను అన్నపూర్ణ స్టూడియోస్, తెలంగాణ రైట్స్ ఏషియన్ సినిమాస్ దక్కించుకున్నాయి. ''చక్కని కామెడీ ఫ్యామిలీ డ్రామాగా 'డియర్'ని వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, పృథ్వీరాజ్ నిర్మించారు. తెలుగులో గ్రాండ్‌గా విడుదల చేయనున్నాం. తమిళంలో పాటలు పాపులర్ అయ్యాయి. త్వరలోనే తెలుగు పాటలను విడుదల చేయనున్నాం'' అని తెలుగు హక్కులు సొంతం చేసుకున్న సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.